క్లుప్తంగా

సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం


జెండా ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని సత్యసాయి శాంతిక్షేత్రంలో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మందిరం కన్వీనర్ బీఎస్ ప్రసాద్, అమర్నాథ్‌లు జెండా ఆవిష్కరించారు. అనంతరం నగర సంకీర్తనలు ఆలపించారు. రుద్రాభిషేక సహిత షోడశోపచారపూజ, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

20న దుర్గావారాహి ఆలయ శంకుస్థాపన

రణస్థలం: మండలంలోని పిసిని గ్రామంలో దుర్గా వారాహి అమ్మవారి దేవాలయ శంకుస్థాపన మహోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాలభైరవస్వామికి పూజలు


స్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్యాన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల కేశవరెడ్డి పాఠశాలలో రెండు రోజులు పాటు నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎచ్చెర్ల, అరసవల్లి, అంపోలు, రాజమండ్రి క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆంధ్రాజోన్ ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


స్వామిని దర్శించుకుంటున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో పూజారి తవిటినాయడు గురుస్వామి ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌ను స్వాములు సన్మానించి అయ్యప్పస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, కేవీవీ సత్యనారాయణ, సీపాన ఎర్రంనాయుడు, మాడుగుల మురళీధర్‌బాబా, కిల్లి ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక మహా రుద్రాభిషేకం


రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరులోని భవానీ చంద్రశేఖరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక మహా రుద్రాభిషేకం, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది దంపతుల సమక్షంలో శివపార్వతులకు కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ సాగు.. ఆదాయం బాగు

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో సాగు
- రైతులే సొంతంగా విక్రయిస్తుండటంతో లాభాలు


కేశవరావుపేటలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్


అమ్మకానికి సిద్ధంగా కాలీఫ్లవర్

ఎచ్చెర్ల క్యాంపస్: కార్తీకమాసం వచ్చిందంటే కూరగాయలకు గిరాకీ ఎక్కువ. ప్రధానంగా ఈ సీజన్‌లో దొరికే కాలీఫ్లవర్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో సుమారు 1000 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సైజ్ బట్టి ఒక్కో పువ్వు రూ.20 నుంచి రూ.30 వరకు ధర పలుకుతోంది. ఎకరాకు పంట బట్టి కనీసం రూ.70 వేలు నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తోంది. దీంతో కాలీఫ్లవర్ సాగు చేస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎచ్చెర్ల మండలం శ్రీకాకుళం పట్టణానికి సమీపంలోనే ఉండటం, మార్కెట్‌కు వెళ్లి విక్రయించే వీలు కలగడం, సైకిళ్లు, బైక్‌లు, మోపెడ్‌లపై వీధుల్లో అమ్మే అవకాశం ఉండటం, ఉదయం, సాయంత్రం రోడ్డు పక్కల అమ్ముకునే అవకాశం ఉండటంతో మధ్య వర్తులు లేకుండా రైతులే నేరుగా ఆదాయం పొందుతున్నారు. దీంతో కొనేవారికి కూడా తక్కువ ధరకే లభిస్తోంది.

అంతర పంటగానూ..

ఎచ్చెర్ల మండలంలో కేశవరావుపేట, ఎస్ఎంపురం పేట, ఎచ్చెర్ల, చిలక పాలేం, ఫరీదుపేట వంటి గ్రామాల్లో కాలీఫ్లవర్‌ను ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొందరు రైతులు అంతర పంటగా సైతం కాలీఫ్లవర్‌ను సాగు చేస్తున్నారు. మిరప, గోరు చిక్కుడు, వంగ తదితర పంటలతో కలిపి పండిస్తున్నారు. ఎకరాకు రూ.25 వేలు వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఏటా మెరుగైన ఆదాయం వస్తుండటంతో ప్రతి రైతు కనీసం 20 సెంట్లలో అయినా కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు.

ఆదాయం బాగుంది..



ఈ ఏడాది ధరలు బాగున్నాయి. నేను ఎకరా వరకు సాగు చేశాను. నేరుగా అమ్మడంతో మార్కెట్‌కు వెళ్లి హోల్‌సేల్ వ్యాపారులకు ఇస్తున్నాను. కార్తీకం పూర్తయ్యే వరకు డిమాండ్ ఉంటుంది.

– ఎం.ధనుంజయరావు, మెట్టపేట

అంతర పంటగా..



నేను మిరపలో అంతర పంటగా ఎకరాలో కాలీఫ్లవర్ సాగు చేశాను. పెద్ద సైజు పంట వస్తోంది. సీజన్ ప్రారంభం నుంచి ఒక్కో పువ్వు రూ. 20 నుంచి రూ.30 వరకు ధర పలుకుతోంది.

– ఎం.ప్రసాద్, మెట్టపేట

సీజనల్ పంట..

రైతులు సీజనల్ పంటలు, వైవిధ్య పంటలు సాగు చేస్తే లాభాలు వస్తాయి. ఈ సీజన్‌లో కాలీ ఫ్లవర్ ప్రధాన పంట. కార్తీక మాసంలో డిమాండ్ ఎక్కువ. మేలు రకం విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

– వై.సురేష్, వ్యవసాయ అధికారి, ఎచ్చెర్ల

నర్సింగ్ కళాశాల ప్రారంభమెప్పుడో?



సింగుపురం జాతీయ రహదారి వద్ద నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనాలు ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం విద్యార్థుల బోధన, వసతి అంతా రిమ్స్ మెడికల్ కళాశాల్లోనే జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నర్సింగ్ కళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

అసంపూర్తిగా డ్రైనేజీ



ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల పక్కన సర్వీసు రోడ్డుపై డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఈ ప్రదేశంలో ప్రమాదాలు జరిగే అవకాశముంది. డ్రైనేజ్ నిర్మాణం పూర్తిచేసి సిమ్మెంట్ పలకలు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఎన్నాళ్లీ మురుగుపాట్లు?



లావేరు మండలం తాళ్లవలస ప్రధాన వీధిలో కాలువలు మురుగు నీటితో నిండిపోయాయి. ఎక్కడి కక్కడ వాడుక నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు బెడద ఎక్కువైందని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

–ఎచ్చెర్ల

సర్పంచ్‌లకు ఇచ్చే గౌరవం ఇదేనా?


అధికారులను ప్రశ్నిస్తున్న వాడాడ సర్పంచ్ సుంకాన సురేష్

గార: సర్పంచ్‌లకు అధికారులు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని, తీర్మానాలపై సంతకాలకే పరిమితం చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గార మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొర్ని సర్పంచ్ పీస గోపి, పీస శ్రీహరిరావు, కె.మత్స్యలేశం సర్పంచ్ బి.లలిత ఎర్రన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు సమాచారం ఇచ్చేందుకు ఇష్టపడటం లేదని, అభివృద్ధి పనులు ఎక్కడ జరుగుతున్నాయో తెలియడం లేదని, ఇలాగే జరిగితే అధికారులనే బాధ్యులను చేయాల్సి వస్తుందన్నారు. వాడాడలో తమను పిలవకుండానే గ్రామ సభ నిర్వహించుకున్నారని సర్పంచ్ సుంకాన సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రీ సర్వే డీటీ రామారావు స్పందిస్తూ సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారమివ్వాలని వాడాడ వీఆర్‌వోకు చెప్పామన్నారు. పీస శ్రీహరిరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రజాదర్బార్‌కు పిలిచారని, వేదికపై ప్రజాప్రతినిధులు కానివారంతా ఉండటంతో వెనుదిరిగామన్నారు. ఎంపీపీ రఘురామ్ మాట్లాడుతూ ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లా కలెక్టర్‌కు లేఖలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, వైస్ ఎంపీపీ అరవల శార్వాణి, అంధవరపు రామలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థిని అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలస గ్రామానికి చెందిన 21 ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైంది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల సమీపంలోని ఓ విద్యా సంస్థలో విద్యార్థిని బి.ఫార్మసీ చదువుతోంది. కేసు నమోదు చేసిన పోలీసులు విద్యార్థిని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

పోలీసులకు చిక్కిన పేకాటరాయుళ్లు

గార : మండలంలోని మొగదాలపాడు బీచ్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల గస్తీ కాస్తుండగా.. కొందరు జీడితోటల్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.15,200 స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు.

కూర్మనాథాలయానికి భక్తుల తాకిడి


క్యూలైన్‌లో భక్తుల రద్దీ

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పుష్కరిణిలో స్నానాలచరించారు. అనంతరం క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వెనుక ఉన్న పర్యాటక భవనంలో మూడు వందల మందికి అన్నదానం నిర్వహించగా, ఈవో గురునాథం పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు జల్లేపల్లి గిరిధరరావు, శ్రీధరరావు దంపతులు, కుటుంబీకులు పర్యవేక్షణలో అర్చక ప్రతినిధులు రేజేటి రామారావు, శ్రీనివాసాచార్యులు బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ వేడుకకు మురపాకతో పాటు పీబీనగర్‌కాలనీ, గుంటుకుపేట, ఆరంగిపేట గ్రామాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు, అయ్యప్పస్వాములు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్తలు సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, గోవిందనామాలు, వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. డిప్యూటీ కలెక్టర్ జల్లేపల్లి మాధవి తన కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని రూ. 10 వేలు విరాళంగా అందించారు. వండాన సురేష్, గణేష్, తల్లూరి మధుల సహాయంతో సుమారు 5 వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జల్లేపల్లి కేశవరావు, జనార్దనరావు, మడ్డి కనకయ్య, డాక్టర్ బాబీ, నాగులపల్లి కృష్ణ, లక్ష్మణరావు, ప్రభాకరరావు, మణిబాబు, రొంపివలస మల్లేశ్వరరావు, రాజు, మధు, సూరీడమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

హద్దురాళ్లపై పేర్లు తొలగింపు


సర్వే రాళ్లపై పేరు తొలగిస్తున్న దృశ్యం

రణస్థలం: గత ప్రభుత్వ హయాంలో మండలంలోని 56 రెవెన్యూ గ్రామాలకు గాను 25 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూ సమగ్ర సర్వే పూర్తి కావడంతో జగనన్న భూ సురక్ష హద్దురాళ్లు పాతిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సర్వే రాళ్లను అలానే ఉంచి జగనన్న పేరును పాలిష్ యంత్రాలతో చెరిపేస్తున్నారు. గత ప్రభుత్వంలో జగనన్న సర్వేతో ఎన్నో భూ వివాదాలు పరిష్కారమయ్యాని, ఇప్పుడు పేరు చెరిపేస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. రణస్థలం, లావేరు మండలల్లో పేరు తొలగింపు ప్రక్రియ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు మండల సర్వేయర్ ఎస్.రవి తెలిపారు.

పకడ్బందీగా సర్వే


శ్రీకాకుళంలో సర్వేను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రమణ

శ్రీకాకుళం :ఎస్.హెచ్.జి.ప్రొఫైలింగ్ యాప్ ద్వారా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని మెప్మా పీడీ ఎస్.వి.రమణ ఆదేశించారు. ఆదివారం పట్టణంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. మెప్మా ద్వారా పట్టణ స్వయం స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు సంపూర్ణ ఆర్థిక తోడ్పాటు, మెరుగైన జీవనోపాధుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అమ్మకాల అమ్మకాలు ప్రోత్సహిస్తూ వాణిజ్య విస్తరణ చేసి అధిక ఆదాయాన్ని సముపార్జించేలా మెప్మా ఎండీ తేజ్‌భారత్ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో సీఎంఎంఎస్ వెంకటరావు, సీఓలు ఎం.అమ్మినాయుడు, సీతరాజు, సాయిసత్యనారాయణ పాల్గొన్నారు.

వర్సిటీలో మేనేజ్‌మెంట్ దినోత్సవం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ దినోత్సవం నిర్వహించనున్నట్లు కోర్సు కో ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. బిజినెస్ క్విజ్, స్టార్టప్ ఐడియా, మెమొరీ గేమ్, గ్రూప్ డిస్కషన్స్, క్రియేటివ్ క్లిక్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోటీతత్త్వంతో మెరుగైన ఫలితాలు


బలగ శాఖాగ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు


జి.సిగడాం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు


ఎచ్చెర్ల క్యాంపస్: కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: పోటీతత్త్వంతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బలగ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై పోటీలు జరిగాయి. గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన, సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

జి.సిగడాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.నీలమ్మ పర్యవేక్షించారు.

కిటకిటలాడిన బీచ్‌లు


మొగదాలపాడు తీరానికి సందర్శకుల తాకిడి

గార: కార్తీక ఆదివారం సందర్భంగా మొగదాలపాడు, కె.మత్స్యలేశం, శ్రీకూర్మం- మత్స్యలేశం బీచ్‌లు సందర్శకులతో కిటకిటలాడాయి. కుటుంబ సభ్యులతో కలసి సమీప జీడితోటల్లో వంటలు చేసుకుని, సాయంత్రం సముద్రంలో స్నానాలు చేసి సందడి చేశారు. పలువురు శాలిహుండం బౌద్ధారామాలను సందర్శించారు. కళింగపట్నం వద్ద బీచ్‌కు అనుమతులు లేకపోవడంతో సందర్శకులను మెరైన్ సీఐ బి.ప్రసాదరావు అవగాహన కల్పించి వెనక్కి పంపించేశారు. ఎస్ఐ ఆర్.జనార్దన సిబ్బందితో గస్తీ నిర్వహించారు.

రచనలు సామాన్యులకూ అర్థంకావాలి


కేంద్ర గ్రంథాలయంలో కవులకు సత్కారం


లావేరు గ్రంథాలయంలో కవులకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్: సామాన్యులకు కూడా అర్థమయ్యేలా రచనలు చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అధ్యక్షతన ఆదివారం కవితా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త, శాంతినికేతన్ డైరెక్టర్ సురంగి మోహనరావు మాట్లాడుతూ విద్యార్థిలు సెల్‌ఫోన్‌కు స్వస్తి పలికి గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పొందాలన్నారు. అనంతరం వేమన కవితామయం అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) ఆధ్వర్యంలో కవితా దినోత్సవం నిర్వహించారు. కవి గుడిమెట్ల గోపాలకృష్ణ హాస్యం-వ్యంగ్యంతో కూడిన మినీ కవితలతో అలరిస్తే.. కవి కె.వి.రాజారావు సందేశాత్మక కవిత, వావిలపల్లి రాజారావు, ఉమాకవి, కె.శ్రీనివాసరావు, సంతోష్, ఐఎస్‌డి ప్రసాదరావు, చోడవరపు ఈశ్వర్ తదితరుల కవితలు ఆలోచింపజేశాయి. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, జంధ్యాల శరత్‌బాబు, ఉప్పు త్రినాథరావు, మజ్జి మోహనరావు, వాడాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత ఈ.వేమన, కవి కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం విశ్రాంత గ్రంథాలయ అధికారిగా ఉన్న డి.గోపాలరావు, టి.వైకుంఠరావు, ఎస్‌వీకే రాజాచార్యులు, పి.వి.జె.గుప్తా, బి.రామకృష్ణ, జి.గోవిందరావు, ఎం.చంద్రశేఖరరావులను గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు సన్మానించి జ్ఞాపికలు అందించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ అధికారి వీరభద్రుడు, విద్యార్థులున్నారు.

29న చలో శ్రీకాకుళం


కరపత్రం ఆవిష్కరిస్తున్న దళిత సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ/ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న చలో శ్రీకాకుళం నిర్వహిస్తున్నట్లు దళిత సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి జిల్లా పరిషత్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వర్గీకరణపై సుప్రీం కోర్టు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని కోరారు. ఎస్సీ/ ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణరే దేశవ్యాప్తంగా ఎస్సీ/ ఎస్టీ సామాజిక వర్గాల ప్రజల ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు, రిటైర్డ్ ఐఏఎస్ రుంకు అప్పారావు, వాడాన కృష్ణారావు, గుణాపు ఇల్లయ్య, కల్లేపల్లి రాంగోపాల్, జిల్లా ఎస్సీ/ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో-కన్వీనర్ డా: కంఠ వేణు, ఏసీటీఓ రాయి వేణుగోపాల్, బోనెల రమేష్, బొడ్డేపల్లి భూపతిరావు, యజ్జల గురుమూర్తి, సీర రమేష్‌బాబు, చీర రాజేశ్వరి, గండి ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, టి.గోవిందరావు, కె.రామారావు, బొత్స భాస్కరరావు, వంకు ప్రసాద్ పాల్గొన్నారు.